క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో ఇందిర బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాలపై ప్రభుత్వం సూచించిన మెనూ మాత్రమే విద్యార్థులకు అందజేయాలన్నారు. రోజూ విద్యార్థులకు రుచికరంగా, పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి విద్యార్థులకు భోజనం అందజేయాలన్నారు. నాణ్యతలో లోపాలు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని, ఉపాధ్యాయులు భోజన పదార్థాలను రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు అందజేయాలన్నారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు రోజూ ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆమె సూచించారు. ఈమె వెంట హెచ్ఎం శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఇందిర అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో జరిగిన ఫిజియోథెరపీని ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వారంలో ఒక్క రోజు జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు. దీన్ని బాధ్యతగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీతో అనేక ఉపయోగాలు ఉన్నాయని, వాటిని గమనించి ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా కొన్ని రాయితీలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ అంకారావు, ఐఈఆర్టీ తేజరూపిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు పరిశీలన

తాళ్లూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రుణాల కోసం ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం తాళ్లూరు-1 సచివాలయంలో రుణాల దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీవో దారా హనుమంతరావు, ఏవో సత్యం, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



దొనకొండ-గజ్జలకొండ రోడ్డు

దొనకొండ: దొనకొండ-గజ్జలకొండ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలో 18 పంచాయతీల్లో అధ్వానంగా ఉన్న 14 కిమీ దొనకొండ-గజ్జలకొండ రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉంది. వర్షానికి రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడి రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు బాగుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని గ్రామాల్లోని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు సైడు జారి ప్రమాదానికి గురవుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు నిత్యం ఈ రోడ్డు నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇండ్లచెరువు, గజ్జలకొండ, నాగిరెడ్డిపల్లి, పోతలపాడు, గానుగపెంట తదితర గ్రామాల ప్రజలు నిత్యం వాహనాలపై వెళ్తుంటారు. ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన కూడా గతంలో జరిగింది. అంతేకాకుండా ఆటోలు ప్రమాదానికి గురవుతున్నాయి. రాత్రి పూట ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఎదురు వచ్చే వాహనాలు తప్పించబోయి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. గ్రామాల్లోని ప్రజలు నిత్యం మండల కేంద్రమైన దొనకొండకు అనేక పనుల మీద తరుచూ వస్తుంటారు. అంతేకాకుండా పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఆటోలు సైతం వెళ్లాలంటే మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రజలకు అవసరం సమయంలో ఆటోలు బాడుగకు కూడా రావడం లేదు. వర్షం పడిన సమయంలో రోడ్డు మొత్తం నీరు చేరి వాహన చోదకులకు రోడ్డు కనపడటం లేదు. ఎన్నోసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహన చోదకులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డు అధ్వానంగా తయారవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దొనకొండ నుంచి రాత్రి వేళల్లో గ్రామానికి చేరుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. వాహనాలు కిరాయికి రావటం లేదు. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– పైడిపోగు రామయ్య, మాజీ సర్పంచ్

వర్షాకాలం ఇబ్బందికరంగా ఉంది



ఈ రోడ్డు నుంచి నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉంది. వర్షం పడిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మండల కేంద్రం దొనకొండకు వ్యవసాయ పనులపై మార్కాపురం వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. మరి ముఖ్యంగా దొనకొండకు విద్యార్థులు పాఠశాలకు రావల్సి వస్తోంది. వర్షం పడిన రోజు విద్యార్థులు బడికి రావటం మానుకుంటున్నారు.

– వెన్నపూస చెంచిరెడ్డి

ఎండుగడ్డికి నిప్పు

- ఆకతాయిల చేష్టలతో రైతులకు తీరని నష్టం



పెద్దారవీడు సమీపంలో కొండపైకి వెళ్తున్న మంటలు

పెద్దారవీడు: వేసవి కాలం వచ్చిందంటే పచ్చిక గడ్డి ఎండిపోతోంది. ఇలాంటి సమయంలో ఆకతాయిలు, తాగుబోతులు ఎండు గడ్డికి నిప్పు పెడుతున్నారు. ఆ నిప్పు సమీపంలోని పంట పొలాలకు వ్యాపించడంతో రైతులు సాగు చేసిన పంటలు బుగ్గి పాలవుతున్నాయి. మండల పరిధిలోని పెద్దారవీడు, గుండంచర్ల, కలనూతల, సుంకేసుల, తంగిరాలపల్లి, బద్వీడుచెర్లోపల్లి, బద్వీడు, తోకపల్లి, గొబ్బూరు, తదితర గ్రామాలు కొండ ప్రాంతాల్లో ఉన్నాయి. ఎక్కడో ఒక చోట ఎండు గడ్డికి నిప్పు పెడుతుండటంతో రోజుల తరబడి కొండ ప్రాంతాలు కాలుతూ బుగ్గి పాలవుతున్నాయి. మండల పరిధిలో కొండలు ఎక్కువగా ఉండటంతో అడవి పందులు, జింకలు, కుందేళ్లు, తదితర వన్య ప్రాణులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఆకతాయిలు కొండలకు నిప్పు పెట్టడంతో రోజుల తరబడి అటవీ సంపద కాలిపోవడమే కాకుండా అటవీ జంతువులు మంటల్లో కాలిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వేసవి కాలం వచ్చిందంటే పంటలు సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలి. పెద్దారవీడు నుంచి చిన్నదోర్నాల గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా పొలాల గట్ల వెంబడి ఎండు గడ్డిని రైతులు తొలగించుకోవాలి. పొలాల సమీపంలో మద్యం తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి కాలం పూర్తయ్యే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలి. మద్యం ప్రియులు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్నారు. ముఖ్యంగా కొండల చాటున, పొలాల గట్ల చెట్ల వద్ద మద్యం తాగుతూ సిగిరెట్ లేక బీడీ తాగి ఆర్పకుండా నిర్లక్ష్యంగా పడేస్తుండటంతో ఎండుగడ్డి అంటుకుంటోంది. అది కాస్తా కొండలు కాలుతూ వచ్చి సమీపంలో ఉన్న పంటలకు మంటలు వ్యాపిస్తున్నాయి. ఈ మంటల్లో కంది, పొగాకు, మిరప, జొన్న, తదితర పంటలు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పొలాల్లో ఉన్న డ్రిప్పులు, ప్లాస్టిక్ పైపులు, వ్యవసాయ పరికరాలు కాలిపోవడంతో రైతులు అపారంగా నష్టపోతున్నారు. బుధవారం పెద్దారవీడు గ్రామం సమీపంలో ఆశ్రమం దగ్గర రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు సిగిరెట్ తాగి ఆర్పకుండా పడేసిన ముక్క వల్ల అది ఎండుగడ్డికి అంటుకొని పక్కనే ఉన్న దుదేకుల నాగులమీరా కంది పంటకు వ్యాపించాయి. దీంతో పంట కాలిపోవడంతో దాదాపు రూ.10 వేల నష్టం వచ్చినట్లు బాధితుడు తెలిపారు. కొండలకు నిప్పు పెట్టకుండా కాపాడేందుకు గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటవీశాఖ అధికారులు ఆకతాయిలపై నిఘా పెట్టి కొండలకు నిప్పు పెట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, అటవీ సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



పొలంలో కాలిపోయిన కంది పంట

రెవెన్యూ కార్యాలయం వద్ద సీఐటీయూ నిరసన



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దర్శి: కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు, ఉద్యోగులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను అన్యాయంగా రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మిక, ఉద్యోగులకు ఉన్న కొద్దిపాటి హక్కులను కూడా రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తోన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే యూనియన్లు కార్మికులను కాపాడుకోలేవని చెప్పారు. సమస్యలపై సమ్మె చేసే హక్కు కూడా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం పోతుందన్నారు. యజమానులు ఇష్టానుసారంగా దోచుకు తింటారని చెప్పారు. పనికి భద్రత లేకుండా పోతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు ఉండవన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ లేకుండా కార్మిక, ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చడానికి తెచ్చిన ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఈ బిల్లును ఏప్రిల్ 25వ తేదీ నుంచి అమలు చేసేందుకు పూనుకుందని, వెంటనే బిల్లును రద్దు చేయకుంటే కార్మిక, కర్షక, ఉద్యోగులంతా ఐక్యంగా సమ్మె చేసేందుకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేబాషా, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, యోహోషువా, కృపారావు, సుబ్బారావు, జనరాజపల్లి కాశీం పాల్గొన్నారు.

ఇది పేదల బడ్జెట్ కాదు

- ఇది వ్యవసాయ రంగానికి ఉపయోగం లేని కార్పొరేట్ బడ్జెట్
- బడ్జెట్ కరపత్రాల దహనం



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

ముండ్లమూరు (దర్శి): కేంద్ర బడ్జెట్ పేదల బడ్జెట్ కాదని, వ్యవసాయ రంగానికి కూడా ఉపయోగపడని కార్పొరేట్ బడ్జెట్ అని ఏపీ రైతు సంఘ మండల కార్యదర్శి పంటా ఏడుకొండలు అన్నారు. స్థానిక మండల కార్యాలయం వద్ద డబ్జెట్ కరపత్రాలను ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంటా ఏడుకొండలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం మీద ఆధార పడి పంటలు పండిస్తూ దేశానికి తిండి పెడుతున్న అన్నదాతలను మోసం చేసే బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారని విమర్శించారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా వ్యవసాయ రంగానికి ఇచ్చే సబ్సిడీలు తగ్గిస్తూ వ్యవసాయ రంగాన్ని దివాలా అంచులకు నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పత్రాలను దహనం చేస్తూ నిరసన తెలుపుతున్నామని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి బడ్జెట్‌లో వ్యవసాయానికి నిధులు పెంచి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, లేకుంటే భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ నాయకులు బోడపాటి హనుమంతరావు, గంగినేని సత్యనారాయణ, ఉల్లగంటి వెంకట్రామిరెడ్డి, పడిగపాటి కొండలరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



శేషారత్నానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పార్టీ కార్యకర్త కందూరి రాజబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల కాలంలో రాజబాబు తల్లి శేషారత్నం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాళ్ల ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజబాబు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఆర్యవైశ్య సంఘ నాయకులు సూరె ప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి ఆర్థిక సాయం

యర్రగొండపాలెం: విద్యుదాఘాతానికి గురై తీవ్ర ఇబ్బంది పడుతున్న బాధితుడిని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. మండలంలోని అయ్యంభొట్లపల్లికి చెందిన పెద్దపోగు గురవయ్య 2024 డిసెంబర్ 21వ తేదీన యర్రగొండపాలెంలోని జగనన్న కాలనీలో సెంట్రింగ్ పని చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అప్పటి నుంచి స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్దేఉంటున్న ఆయన ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అతడిని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం చేశాడు. గాయం మానే వరకు వైద్యశాలలో చికిత్స పొందాలని, అందుకు తాను సహకరిస్తానని ఎమ్మెల్యే తాటిపర్తి భరోసా ఇచ్చాడు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ



దొనకొండ స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

దొనకొండ: పోలీసులు పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. చట్టం అందరికీ సమానమేనని, పోలీసులు చట్టానికి లోబడి పని చేయాలని స్పష్టం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఆయన దొనకొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో వృత్తి, నైపుణ్యాన్ని పెంచుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ప్రతి పల్లెలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఒక్క సీసీ కెమెరా 100 పోలీసులకు సమానం అన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రికార్డు పరిశీలించి పెండింగ్ కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో, మహిళా భద్రత విషయంలో రాజీ పడకుండా పని చేయాలని సూచించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, గతంలో శిథిలావస్థకు చేరిన పోలీసుస్టేషన్‌ను, క్వార్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచన, సలహాలందించారు. ఆయన వెంట డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ డి.హస్సన్, త్రిపురాంతకం ఎస్ఐ బసవరాజు, స్టేషన్ ఇన్‌చార్జి రంగనాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కురిచేడు (దొనకొండ): గ్రామాలు, పట్టణాల్లో ప్రధాన కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు అదుపులోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఆయన కురిచేడు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలను నెలకొల్పడంలో సీసీ కెమెరాలు కీలకమన్నారు. గ్రామాల్లో జరిగే గొడవలను సీసీ కెమెరాలు నిక్షిప్తం చేస్తాయని, కేసుల దర్యాప్తులో వీడియోలు కీలకంగా మారతాయన్నారు. రౌడీ షీటర్ల కదలికపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు సైబర్ మోసాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులు పొలం, ఇంటి స్థలాలు దారి విషయం పరిష్కరించాలని ఎస్పీ వినతిపత్రం అందజేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచన, సలహాలందించారు. ఆయన వెంట డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ డి.హస్సన్, ఎస్ఐ శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్ దశ కీలకం



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఎంఈవో ఆంజనేయులు

యర్రగొండపాలెం: ఇంటర్ దశలోనే విద్యార్థుల జీవితాన్ని ప్రభావితం చేస్తుందని, ఈ దశలో ఎన్నో ఒడుదొడుకులకు లోనవుతారని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిరంతరం చదివి ఇంటర్‌లో మంచి మార్కులు సాధిస్తే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతుందని, ఇటువంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని, అప్పుడే ఉన్నత స్థాయికి ఎదగగలుగుతారని పేర్కొన్నారు. ఎంఈవో-2 మల్లూనాయక్, కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, హెచ్ఎం పిచ్చారావు పాల్గొన్నారు.

పల్లెకు పట్టుకొమ్మ శివారెడ్డి

ముండ్లమూరు (దర్శి): పల్లెకు పట్టుకొమ్మలాంటి వాడు శివారెడ్డి.. అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఈదరలో ప్రపంచ ఖోఖో చాంపియన్ పోతిరెడ్డి శివారెడ్డిని బుధవారం బీజేపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా వాసి ఖోఖోలో విశ్వవిజేతగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. శివారెడ్డి ఇంకా మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, చెరుకూరి అనీల్, మండల అధ్యక్షుడు ఎం.శేషయ్య, రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసులు, నరసింహారావు, కాసు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



శివారెడ్డిని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

అవగాహన సమావేశం



మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్

తాళ్లూరు: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం 117 జీవో రద్దు, మోడల్ పాఠశాలల ఏర్పాటు గురించి అవగాహన కార్యక్రమాన్ని ఎంఈఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ జీవో రద్దు మోడల్ స్కూల్స్ ఏర్పాట్ల గురించి ప్రధానోపాధ్యాయులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, ఎంఈఓ-1 సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్, బొద్దికూరపాడు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సుబ్బారావు, తూర్పు గంగవరం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ అరుణకుమారి, తాళ్లూరు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ పనిముట్లు, ట్రాక్టర్ల పరిశీలన



తోకపల్లిలో ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, గొబ్బూరు, పుచ్చకాయలపల్లి, సుంకేసుల, కలనూతల, బద్వీడుచెర్లోపల్లి, సానికవరం, మద్దలకట్ట, చట్లమిట్ల, బోయదగుంపుల, తోకపల్లి, కంభంపాడు, తంగిరాలపల్లి గ్రామాల్లో యంత్ర సేవా పథకం ద్వారా సీహెచ్‌ఏసీ సభ్యులకు మంజూరైన పనిముట్లు, ట్రాక్టర్లను వ్యవసాయాధికారులు బుధవారం తనిఖీ చేశారు. గత ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీ ద్వారా మంజూరైన ట్రాక్టర్ల ఇన్వాయిస్, సీరియల్ నంబర్లు నమోదు చేసుకున్న అనంతరం రైతు సేవా కేంద్రంలో యంత్ర సేవా పథకానికి సంబంధించిన ఆదాయ జమా ఖర్చులు, బ్యాంక్ రుణాలు, జమలు వంటి రిజిస్టర్లను పరిశీలించారు. ప్రస్తుతం ట్రాక్టర్లు, పనిముట్లు ఉపయోగంలో ఉన్నాయని గ్రూపు సభ్యులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. డీడీఏ ఎం.సుబ్రహ్మణేశ్వరరావు, టెక్నికల్ ఏఓ శ్రీనివాస్ నాయక్, ఏఓ కె.బుజ్జిబాయి, బీటీఎం వాణి, ఉద్యాన, పట్టు సహాయకులు, సీహెచ్‌సీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



ఐసీడీఎస్ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని, లేకుంటే ఈ నెల 17, 18, 19 తేదీల్లో ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బుధవారం స్థానిక ఐసీడీఎస్ పీవో పద్మావతికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచడంతో పాటు గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జీవో జారీ చేయాలని కోరారు. పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అనేక సేవలు అందిస్తున్నామని, సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, 2024 జూలైలో తమ వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని, సర్వీసులో ఉండి మృతి చెందిన కుటుంబాలకు దహన సంస్కరణల కింద రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమ్మె కాలంలో మృతి చెందిన వారికి కూడా ఈ నిబంధన అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రామసుబ్బమ్మ, పద్మ, షేక్ షంషాద్, రూత్‌మేరీ, రామకుమారి, తిరుపాలమ్మ, శివపార్వతి, నసిమా, విజయలక్ష్మి, రేణుక, కోటేశ్వరి, బేబిరాణి పాల్గొన్నారు.